సాక్షి
నిర్మల్
మంగళవారం । 8 । ఆగస్టు । 2023

9 నుంచి 'మేరీ మాటి మేరా దేశ్'

నిర్మల్‌ఖిల్లా: ఆజాదీకా అమృత్ మహోత్సవ్ ముగింపు కార్యక్రమంలో భాగంగా ఈ నెల 9 నుంచి 31 వరకు బీజేపీ ఆధ్వర్యంలో 'మేరీ మాటీ మేరే దేశ్' పేరిట వివిధ కార్యక్రమాలు కొనసాగుతాయని ఆ పార్టీ అసెంబ్లీ ని యోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డి తెలిపా రు. సోమవారం పార్టీ కార్యాలయంలో జరిగిన 'మేరీ మాటి మేరా దేశ్' (నేను పుట్టిననేల నన్ను కన్నదేశం) సన్నాహక సమావేశంలో కార్యక్రమ జిల్లా ఇన్‌చార్జి రా జుతో కలిసి మాట్లాడారు. పార్లమెంట్ కన్వీనర్ భూమ య్య, జిల్లా అధికార ప్రతినిధి నరేందర్, అసెంబ్లీ కన్వీ నర్ నాయుడి మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.



గద్దర్‌కు పుష్పాంజలి ఘటించిన మంత్రి

నిర్మల్‌టౌన్: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ప్ర జాగాయకుడు గద్దర్ పార్థివదేహానికి మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోమవారం పుష్పాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి సానుభూతి తెలిపారు.

గరిష్టం/కనిష్టం
31.0 /24.0

వాతావరణం

జిల్లాలో ఆకాశం కొంతమేర మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

'మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్' విజయవంతం చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో ధనరాజ్

నిర్మల్‌టౌన్: జిల్లాలో బోధకాల వ్యాధి నిర్మూలనకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి మాస్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వయస్సు, ఎత్తును బట్టి మూడు రకాలైన డీఈసీ ఐవర్ మెక్టిన్ ఆల్బెండజోల్ మాత్రలు ఇవ్వడం జరుగుతోందన్నారు. 10 నుంచి 12 వరకు బూత్ ఆక్టివిటీ, 13 నుంచి 22 వరకు ఇంటింటి సందర్శన, 23, 24 తేదీలలో మాప్ ఆప్ రౌండ్లు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ధనరాజ్, కార్యక్రమ నిర్వహణ అధికారి డాక్టర్ రాజా రమేశ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

గద్దర్ మృతి తీరని లోటు



నివాళులర్పిస్తున్న నిర్మల్ కవులు

నిర్మల్: ప్రజాగాయకుడు గద్దర్ మృతి తెలంగాణ సమాజానికి తీరని లోటని ప్రముఖ రచయిత, డాక్టర్ దామెర రాములు అన్నారు. జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన సంతాపసభలో కవులు, కళాకారులు నివాళులర్పించారు. గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ తన ఆట పాటతో తెలంగాణ ప్రజల్లో చైతన్యం తెచ్చారని కొనియాడారు. జిల్లాతో గద్దర్‌కు అవినాభావ సంబంధం ఉందన్నారు. కార్యక్రమంలో కవులు, రచయితలు తుమ్మల దేవరావు, పత్తి శివప్రసాద్, నేరెళ్ల హనుమంతు, ఫక్రుద్దీన్, రవి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలి



ఏఎన్‌ఎంల సమస్యలు తెలుసుకుంటున్న 'ఏలేటి'

నిర్మల్‌టౌన్: సెకండ్ ఏఎన్‌ఎంలను రెగ్యులరైజ్ చేయాలని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సోమవారం సెకండ్ ఏఎన్‌ఎంలు చేస్తున్న నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వస్తే కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ అనే పదమే ఉండదని చెప్పిన సీఎం కేసీఆర్ పూర్తిగా వారిని విస్మరించారన్నారు. ఏఎన్‌ఎంల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్, అంజుకుమార్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల విధుల బహిష్కరణ



నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నిర్మల్‌టౌన్: పెండింగ్ వేతనాలు చెల్లించాలని, ఆరునెలల పీఆర్సీ అమలు చేయాలని కోరుతూ పట్టణంలోని మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు సోమవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. నిర్మల్ మాజీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ నాయకులు శ్రీహరి రావు వారికి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా పనిచేయించుకోవడం సరికాదన్నారు. రెండు మూడు రోజుల్లో వారి సమస్యలను పరిష్కరించాలని లేదంటే బీజేపీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, రావుల రాంనాథ్, సామ రాజేశ్వర్‌రెడ్డి, అరవింద్, అంజు కుమార్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, భూపతిరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



రూ.3 లక్షలకు 3 రోజులే..!

- ఈ నెల 10 వరకే గృహలక్ష్మి దరఖాస్తులు
- ఖాళీ జాగాతో పాటు రేషన్‌కార్డు ఉండాలె
- కలెక్టరేట్, మున్సిపల్, ఎంపీడీవో ఆఫీసుల్లో..
- ప్రత్యేకంగా దరఖాస్తు కౌంటర్ల ఏర్పాటు

నిర్మల్: పేద, మధ్యతరగతి కుటుంబాల్లో కొంత కాలంగా ఆశలు రేపుతున్న 'గృహలక్ష్మి'కి ఎట్టకేలకు దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైంది. ఈనెల 10 వరకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలంటూ జిల్లా అధికారులు సోమవారం ప్రకటన జారీ చేశారు. ఈ పథకం కింద రూ.3లక్షలు అందించనున్నారు. ఇందుకు మూడురోజుల గడువు ఇవ్వడమే ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కేవలం మూడురోజుల వ్యవధిలో పేర్కొన్న ధ్రువపత్రాలతో దరఖాస్తు చేసుకోవాల్సి రావడం కొంత ఇబ్బందికరంగా మారనుంది.

ఖాళీ జాగా ఉన్నోళ్లకు..

కేసీఆర్ సర్కార్ అధికారంలోకి రాకముందే పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామని హామీ ఇచ్చింది. ఈమేరకు రెండుపడక గదుల ఇళ్లను నిర్మిస్తోంది. వీటి నిర్మాణంలో ఎదురవుతున్న ఇబ్బందులు, నిర్మాణ వ్యయప్రయాసలను దృష్టిలో పెట్టుకుని ఇటీవల కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఖాళీ జాగా ఉంటే ఇల్లు కట్టుకునేందుకు ఆర్థికసాయం అందిస్తామంది. ముందుగా రూ.5లక్షలు ఇస్తామన్న సర్కారు తాజాగా రూ.3 లక్షలకు కుదించింది. ఇవి కూడా ఖాళీ ప్లాట్ ఉన్న వాళ్లకే ఇవ్వనున్నారు. భూమిలేని వారికి యధావిధిగా డబుల్‌బెడ్రూం ఇళ్ల పథకాన్ని అమలు చేయనున్నట్లు చెబుతున్నారు.

గడువు మూడురోజులేనా?

కొంతకాలంగా ఎదురుచూస్తున్న గృహలక్ష్మి పథకానికి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభించారు. అయితే కేవలం మూడురోజులు మాత్రమే గడువు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 10 లోపు దరఖాస్తు చేసుకోవాలంటూ జిల్లా అధికారులు ప్రకటన జారీ చేయడం గమనార్హం. జిల్లాలో పేద, మధ్యతరగతి కుటుంబాలన్నీ దాదాపుగా ఈ పథకం కోసం ఆశతో ఎదురుచూస్తున్నాయి. ఎంతో కొంత భూమి ఉన్నవారు చాలామందే ఉన్నారు. ప్రభుత్వం పేర్కొన్న మార్గదర్శకాల ప్రకారం కావాల్సిన ధ్రువపత్రాలను అందించడానికి కొంతసమయం తీసుకుంటుంది. కానీ.. కేవలం మూడురోజులు మాత్రమే గడువు ఇవ్వడం దారుణమని జిల్లావాసులు వాపోతున్నారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లినవారు, స్థానికంగా అందుబాటులో లేనివారు కనీసం దరఖాస్తు చేసుకునే పరిస్థితి కూడా ఉండదంటున్నారు. మరోవైపు ఆన్‌లైన్‌లో కాకుండా కలెక్టరేట్, మున్సిపాలిటీలు, మండల పరిషత్ కార్యాలయాల్లో దరఖాస్తులను నేరుగా అందించాలనడంపైనా విమర్శలు ఉన్నాయి. దరఖాస్తుపత్రాలు సైతం అందరికీ అందుబాటులో లేకపోవడం గమనార్హం.

మార్గదర్శకాలు ఇవే..

ఇళ్లు లేకుండా, సొంత స్థలం ఉన్నవారు ఇంటి నిర్మాణం చేసుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 'గృహలక్ష్మి' పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఇళ్లు కట్టుకునేందుకు రూ.3లక్షలు అందించనుంది. ఈ పథకం అమలుకు సంబంధించి ప్రభుత్వం కొన్ని మార్గదర్శకాలు జారీ చేసింది.

- గృహలక్ష్మి పథకం ద్వారా దరఖాస్తు చేసుకునేవారు ఇల్లులేకుండా సొంత స్థలం కలిగి ఉండాలి.
- సంబంధిత దరఖాస్తుదారుకు రేషన్ (ఆహారభద్రత)కార్డు కచ్చితంగా ఉండాలి.
- దరఖాస్తు పత్రం, రేషన్‌కార్డుతో పాటు ఆధార్‌కార్డు, బ్యాంకు ఖాతాపుస్తకం జిరాక్స్‌లు జతపర్చాలి.
- ప్రభుత్వ ఉత్తర్వుల సంఖ్య 59 కింద లబ్ధిపొందని వారు అర్హులు.

దరఖాస్తు చేసుకోవాలి

గృహలక్ష్మి పథకానికి అర్హులైనవారు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలి. ఇల్లులేకుండా సొంత స్థలం ఉన్నవారు ఈ పథకానికి అర్హులు. కలెక్టరేట్‌తో పాటు పట్టణవాసులు మున్సిపాలిటీలో, గ్రామీణ ప్రాంతాల వారు మండల పరిషత్ కార్యాలయాల్లో గడువులోగా దరఖాస్తులు అందించాలి.

– శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా సహకారశాఖ అధికారి

112 ఎకరాలు..

ఆర్టీసీ ఆదిలాబాద్ రీజియన్ ఆస్తులు

- బస్‌స్టేషన్లు, డిపోలు, నివాస స్థలాలు
- జిల్లా కేంద్రాల్లో విలువైన భూములు సైతం..
- ఉద్యోగుల విలీనం నేపథ్యంలో ప్రాపర్టీలపై చర్చ



నిర్మల్ బస్ స్టేషన్

సాక్షి, ఆదిలాబాద్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని బస్‌స్టేషన్ 3.58 ఎకరాల్లో విస్తరించి ఉంది. ఇది ప్రధాన కూడలి కావడంతో ఇక్కడ గజం విలువ బహిరంగ మార్కెట్‌లో దాదాపు రూ.25వేల నుంచి రూ.30వేల వరకు పలుకుతుంది. ఈ లెక్కన దీని విలువ సుమారు రూ.40 కోట్ల పైమాటే. దీని వెనుకాలే 4.76 ఎకరాల్లో డిపో స్థలం విస్తరించి ఉంది. దీని విలువ సుమారు రూ.65 కోట్లపైనే. నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాల్లోనూ బస్‌స్టేషన్లు, డిపోలు ముఖ్య కూడళ్లలోనే ఉన్నాయి. ఈ లెక్కన వందల కోట్ల విలువైన ఆస్తులను ఆదిలాబాద్ రీజియన్ కలిగి ఉంది.

వందల ఎకరాలు..

ఆదిలాబాద్ ఆర్టీసీ రీజియన్‌కు వందల ఎకరాల స్థలాలున్నాయి. ప్రస్తుతం సంస్థ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసిన బిల్లు అసెంబ్లీలో ఆమోదం నేపథ్యంలో ఈ ఆస్తుల విషయంపై చర్చ సాగుతోంది. వీటి విలువ రూ. వందల కోట్లలో ఉండడమే దీనికి కారణం. రీజియన్‌లో 30 బస్‌స్టేషన్లు 68.12 ఎకరాల్లో, ఆరు డిపోలు 41.80 ఎకరాల్లో విస్తరించి ఉన్నాయి. ఆదిలాబాద్, మంచిర్యాలలో సిబ్బంది నివసించేందుకు క్వార్టర్స్ 3.5 ఎకరాల్లో ఉన్నాయి.

వాణిజ్యపరంగా ఆదాయంపై దృష్టి..

విలువైన భూములను కలిగి ఉన్న ఆర్టీసీ కొద్దికాలంగా సంస్థ ప్రాపర్టీ సంరక్షణ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా భైంసా, నార్నూర్, బెల్లంపల్లి, వాంకిడి, జైపూర్, చెన్నూర్, ఇంద్రవెల్లిలో చుట్టూ ప్రహరీలను నిర్మించింది. చెన్నూర్‌లో రూ.4కోట్లతో బస్‌డిపో నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ప్రస్తుతం టెండర్ ప్రక్రియ కొనసాగుతుంది. ఇక జిల్లా కేంద్రాల్లోని బస్‌స్టేషన్లను కమర్షియల్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టడం ద్వారా భారీ ఆదాయంపై దృష్టి సారించారు. నిర్మల్‌లో రూ.35కోట్లతో జీ+2 విధానంలో మొదటి అంతస్తులో షాపింగ్ కాంప్లెక్స్, రెండో అంతస్తులో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. ప్రస్తుతం టెండర్ దశలో ఉంది. రీజియన్ మొత్తంగా ఏడు ఫంక్షన్‌హాళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక రూపొందించారు. అదే విధంగా ఆర్టీసీ స్థలాల్లో సంస్థ ద్వారానే 11చోట్ల పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అందులో చెన్నూర్ పూర్తయింది. ఈ విధంగా ఎంతో విలువైన స్థలాలను కలిగి ఉన్న సంస్థ వాణిజ్య ఆదాయంపై దృష్టి సారించింది. ప్రభుత్వంలో విలీనం తర్వాత ఈ స్థలాల పరంగా ఎలాంటి చర్యలు ఉంటాయనేది ఆసక్తికరం.

బస్‌స్టేషన్ల వారీగా భూముల వివరాలు (ఎకరాల్లో)..

బస్‌స్టేషన్	భూవిస్తీర్ణం
ఆదిలాబాద్	3.58
ఉట్నూర్	3.78
నిర్మల్	5.11
భైంసా	1.95
మంచిర్యాల	1.74
ఆసిఫాబాద్	1.93
లక్సెట్టిపేట	1.87
ఖానాపూర్	2.00
జైనథ్	1.00
బజార్‌హత్నూర్	1.00
బెల్లంపల్లి	10.00
వాంకిడి	0.5
కాగజ్‌నగర్	2.00
జన్నారం	1.66
బాసర	2.00
ముథోల్	2.00
మందమర్రి	2.00
చెన్నూర్	2.70
జైపూర్	0.25
బేల	1.00
గుడిహత్నూర్	0.26
బోథ్	0.55
ఇంద్రవెల్లి	1.50
నార్నూర్	1.0
కుభీర్	0.29
పెంచికల్‌పేట్	0.05

డిపోల వారీగా స్థలాలు (ఎకరాల్లో)

ఆదిలాబాద్	4.76
ఉట్నూర్	4.27
నిర్మల్	6.85
భైంసా	7.27
మంచిర్యాల	3.5
ఆసిఫాబాద్	5.45

పారదర్శకంగా ప్రభుత్వ వైద్యం



క్యూ ఆర్ కోడ్ స్కాన్ చేస్తున్న వైద్యుడు

- ప్రిస్క్రిప్షన్లపై క్యూఆర్‌కోడ్
- ఎక్కడికి వెళ్లినా తెలిసేలా ఆన్‌లైన్‌లో వివరాలు
- జిల్లాలోని మూడు ఆస్పత్రుల్లో అమలు..

నిర్మల్‌చైన్‌గేట్: సర్కారు ఆస్పత్రులకు పేషెంట్లు తక్కువగా వచ్చినా.. ఎక్కువ సంఖ్యలో వచ్చినట్లు చూపించే పద్ధతికి స్వస్తి పలుకుతూ.. ఓపీ సేవల్లో ప్రభుత్వం పారదర్శకతను పెంచింది. వైద్యులు కూడా మొక్కుబడి సేవలకు పరిమితం కాకుండా నాణ్యమైన వైద్యం అందించేలా వారి పనితీరును పర్యవేక్షించేలా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే ఏ వైద్యుడి దగ్గర ఏ ట్రీట్‌మెంట్ తీసుకున్నారో తెలిసిపోతుంది.

కార్పొరేటుకు దీటుగా..

ప్రజారోగ్య సేవలను మరింత సరళతరం చేసేందుకు ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుంటోంది. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్య విధానపరిషత్‌లోని ప్రభుత్వ ఏరియా, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో ఔట్ పేషెంట్ల చిట్టీ(కార్డు)లకు క్యూఆర్ కోడ్ విధానాన్ని ప్రవేశపెట్టింది. తొలుత ఏరియా ఆస్పత్రుల్లో ఈ నూతన పద్ధతిని అమలు చేయడం ఆరంభించారు.

ఏం చేస్తారంటే..

ఓపీ చిట్టీకి ప్రత్యేక కోడ్ నంబర్ కేటాయించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రోగులకు సంబంధించిన బయోడేటా, రోగనిర్ధారణ, ట్రీట్‌మెంట్, వాడే మందుల వివరాలన్నీ టీఎస్‌ఈఎంఐఎస్ డేటా స్టోర్‌కు వెళ్తాయి. కంప్యూటర్‌లో పేరు, వివరాలు నమోదు చేసి ప్రింటెడ్ చిట్టీ ఇస్తారు. దీనిని తీసుకుని డాక్టర్ వద్దకు వెళ్లగానే చిట్టీపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను తన మొబైల్‌తో టీఎస్‌ఈ హెచ్‌ఎంఐఎస్ (తెలంగాణ స్టేట్ ఎలక్ట్రానిక్ హెల్త్ మేనేజ్మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టం)కి అనుసంధానం చేస్తారు. రోగికి ఏమైనా వైద్య పరీక్షలు అవసరమైతే చేయించి.. ఆ పరీక్షల ఫలితాల వివరాల ఆధారంగా మందులు రాస్తారు. రాసిన మందుల ప్రిస్క్రిప్షన్‌ను కూడా ఫోన్‌లో ఫొటో తీసి టీఎస్‌ఈ హెచ్‌ఎంఐఎస్‌కి అప్‌లోడ్ చేస్తారు. ఇలా ప్రతీ వైద్యుడు పేషెంట్ల ఓపీ చిట్టీలతో అందించిన వైద్య సేవలను ఆన్‌లైన్‌లో అనుసంధానం చేయడంతో చిట్టీ నంబర్ చెప్పగానే టీఎస్‌ఈ హెచ్‌ఎంఐఎస్ యాప్‌లో రోగి పొందిన వైద్య సేవలు కనిపిస్తాయి. ఇలా ఎక్కడ ఏరియా ఆస్పత్రికి వెళ్లినా గతంలో తాను పొందిన వైద్య సేవల మందుల చిట్టీ లేకపోయినా.. నంబరు ఆన్‌లైన్‌లో నమోదు చేయగానే వివరాలు తెలిసేలా ఆధునీకీకరించారు.

మూడు ఆస్పత్రుల్లో అమలు..

జిల్లాలోని మూడు ఆస్పత్రుల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. జిల్లా ఏరియా ఆస్పత్రి, జిల్లా ప్రసూతి ఆస్పత్రి, భైంసా ఏరియా ఆస్పత్రి, ఖానాపూర్, నర్సాపూర్, ముథోల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు వైద్య విధానపరిషత్ పరిధిలో ఉన్నాయి. వీటిలో జిల్లా ఆస్పత్రులతోపాటు భైంసా ఏరియా ఆస్పత్రిలో ఆధునిక సేవలను అమలు చేస్తున్నారు. కాగా ఓపీ చిట్టీలను కంప్యూటర్‌లో నమోదు చేసేందుకు డేటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించకపోవటంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

వైద్యసేవలు పారదర్శకంగా..



ఏరియా ఆస్పత్రుల్లో ఆధునిక పద్ధతిలో కార్పొరేట్‌కు దీటుగా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ఓపీ సేవలను కంప్యూటరీకరించింది. అన్ని వైద్యవిధానపరిషత్ ఆస్పత్రుల్లో ఈ విధానం అమలుకు శ్రీకారం చుట్టింది. నాణ్యమైన వైద్యం అందుతుండడంతోపాటు వైద్య సేవలపై పారదర్శకత పెరుగుతుంది.

– డాక్టర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా ఆసుపత్రుల పర్యవేక్షకులు

ప్రజావాణి అర్జీలు తక్షణమే పరిష్కరించాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వరుణ్ రెడ్డి

నిర్మల్‌టౌన్: ప్రజావాణిలో వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని, ఏమాత్రం నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులకు సూచించారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్‌లో గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా వివిధ మండలాల నుండి పలు సమస్యలపై 38 దరఖాస్తులు వచ్చాయి. శాఖల వారీగా అధికారులు వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలలో ఎక్కువగా డబుల్ బెడ్ రూమ్, పింఛన్లకు సంబంధించిన సమస్యలే ఉన్నాయి.

- జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించే ప్రభుత్వ వైద్యకళాశాలలో తమను సర్దుబాటు చేయాలని ప్రస్తుతం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.
- పెంబి మండలంలోని పోచంపల్లి సోముగూడి గ్రామానికి విద్యుత్, రోడ్డుసౌకర్యం కల్పించాలని సర్పంచ్ నరేష్ సమీక్షంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

ప్రజల అవస్థలు పట్టని మంత్రి

- కాంగ్రెస్ నేత శ్రీహరిరావు
- జిల్లా కేంద్రంలో పాదయాత్ర, నిరసన



నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నిర్మల్: నడవడానికి కూడా ఇబ్బంది పడాల్సి వస్తున్న రహదారులను వేయడానికి ఇంకెన్నేళ్లు కావాలని, ప్రజల అవస్థలను మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి పట్టించుకోవడం లేదని కాంగ్రెస్ నియోజకవర్గనేత కూచాడి శ్రీహరిరావు అన్నారు. జిల్లా కేంద్రంలో గుంతలమయంగా మారిన గాంధీచౌక్ ఏరియా రోడ్లపై సోమవారం పాదయాత్ర చేస్తూ.. గుంతలను పూడ్చుతూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రోడ్డువెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోయినవారితో, గుంతలరోడ్డుతో ఇబ్బందులు పడుతున్న స్థానికులతో ఆయన మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రహదారుల దుస్థితి కళ్లకు కనిపిస్తున్నా రెండుమూడేళ్లగా నిర్మాణ పనులు చేపట్టకపోవడం దారుణమన్నారు. జిల్లా కేంద్రంలోనే ఇలా డ్రైయిన్లు, రోడ్లు అస్తవ్యస్తంగా ఉండడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్జుమంద్అలీ, పాడెల్లి గణేశ్, వాహిద్‌ఖాన్, నాందేడపు చిన్ను, ఎంబడి రాజేశ్వర్, అజర్, జునైద్, గా జుల రవి, కొంతం గణేశ్, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు మంత్రికి వినతి



మంత్రికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

లోకేశ్వరం(ముథోల్): మండలంలో శిథిలావస్థకు చేరిన అర్లి వంతెనకు నిధులు మంజూరు చేసి త్వరగా నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ మాజీ జెడ్పీ చైర్మన్ లోలం శ్యాంసుందర్, మండల బీఆర్ఎస్ నాయకులు సోమవారం హైదరాబాద్‌లో మంత్రి ఐకేరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. లోకేశ్వరం–ధర్మోర–అబ్దుల్లాపూర్ మీదుగా రోడ్డు పనులు చేపట్టాలని, పిప్రీ ఎత్తిపోతల పథకం అదనపు పైప్‌లైన్, బ్యాలన్సు వర్కుకోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ రాజేశ్‌బాబు, పీఏసీఎస్ చైర్మన్ రత్నకర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ శ్యాంసుందర్, తదితరులు పాల్గొన్నారు.

రైల్వే లైన్ ఏర్పాటుకు మార్గం సుగమం

- రూ.7.91 కోట్ల నిధులు విడుదల చేసిన కేంద్రం



ఉత్తర్వుల కాపీ తీసుకుంటున్న ఎంపీ 'సోయం'

నిర్మల్‌ఖిల్లా: జిల్లా ప్రజల చిరకాల వాంఛ నెరవేరడానికి మార్గం సుగమమవుతోంది. నిర్మల్ జిల్లా కేంద్రం మీదుగా రైల్వే లైన్ ఏర్పాటుకు అడుగులు పడుతున్నాయి. హైదరాబాద్‌లోని పటాన్‌చెరు నుండి ఆర్మూర్ మీదుగా ఆదిలాబాద్ వరకు రైల్వే లైన్ సర్వే కోసం డీపీఆర్ సిద్ధమైంది. ఇందుకోసం రూ.7.91 కోట్ల నిధులను మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావు సోమవారం ఢిల్లీలోని భారత రైల్వే బోర్డు చైర్మన్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

కలెక్టరేట్‌ను ముట్టడించిన ఆశా వర్కర్లు



కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన కార్యకర్తలు

నిర్మల్‌టౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ జిల్లాలోని ఆశా వర్కర్లు సోమవారం జిల్లా సమీకృత కలెక్టరేట్‌ను ముట్టడించారు. ప్రధాన ద్వారం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమానికి నిర్మల్ మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లను రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, బీజేపీ నాయకులు అయ్యన్న గారి భూమయ్య, సామ రాజేశ్వర్‌రెడ్డి, సాదం అరవింద్, అంజు కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

అనర్హులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు

- మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్



నిరసన తెలుపుతున్న ఖానాపూర్ వాసులు

నిర్మల్‌టౌన్: ఖానాపూర్‌లో అనర్హులకు డబుల్ బెడ్ రూం ఇళ్లు కేటాయించారని ఆదిలాబాద్ మాజీ ఎంపీ, బీజేపీ నేత రాథోడ్ రమేశ్ అన్నారు. సోమవారం ఖానాపూర్ పట్టణవాసులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ కార్డు, ఓటర్ లిస్టులో పేరులేని పక్క రాష్ట్రం, పక్కజిల్లా వారికి డబుల్ బెడ్‌రూంలు మంజూరు చేశారన్నారు. బీఆర్ఎస్ నాయకులు డబ్బులు తీసుకుని తమకు నచ్చిన వారిని ఎంపిక చేశారన్నారు. తక్షణమే అర్హులకు కేటాయించాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్ వరుణ్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇంకా 200 డబుల్ బెడ్ రూములు మంజూరయ్యాయని, అర్హులందరికీ కేటాయిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు భూమన్న యాదవ్, ఆకుల శ్రీనివాస్, గడ్డం రవీందర్, కిషన్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన శ్రీకాంత్, సతీశ్‌కుమార్, విక్రమ్‌తో శిక్షకులు

ఆదిలాబాద్: జిల్లాకు చెందిన అథ్లెటిక్స్ క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తా చాటారు. సోమవారం హన్మకొండ జిల్లా కేంద్రంలో జరిగిన రెండవ రాష్ట్ర స్థాయి జావెలిన్ త్రో పోటీల్లో మూడు పతకాలు సాధించారు. అండర్ 14 విభాగంలో పి. సతీశ్‌కుమార్ స్వర్ణ పతకం, అండర్–16 విభాగంలో ఎస్.శ్రీకాంత్ గోల్డ్ మెడల్, అండర్ 14 విభాగంలో ఆర్. విక్రమ్ 100 మీటర్ల ఈవెంట్లో బ్రాంజ్ మెడల్ సాధించారు. వీరి వెంట శిక్షకులు లక్ష్మణరావు, సునంద్, విజీయస్ రాకేశ్, రాహుల్ ఉన్నారు.

జావెలిన్‌త్రోలో విద్యార్థికి గోల్‌మెడల్

బజార్‌హత్నూర్: హన్మకొండలో సోమవారం నిర్వహించిన సెకండ్ స్టేట్ మీట్ జావెలిన్‌త్రో క్రీడా విభాగంలో జాతర్ల మోడల్ స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థి నైని శ్రీకాంత్ ప్రతిభ కనబర్చాడు. అండర్–16 బాలుర విభాగంలో 48.15మీటర్లు దూరం విసిరి గోల్డ్ మెడల్ సాధించాడని స్పోర్ట్స్ కోచ్ లక్ష్మీరామ్ తెలిపారు. ఏటీడీవో సౌజన్య, పాఠశాల హెచ్ఎంలు గొడం చందన్, ఉపాధ్యాయులు శ్రీకాంత్‌ను అభినందించారు.

కల్తీ పెట్రోల్



ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రంలో జీసీసీ ద్వారా ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ కల్తీ జరుగుతుందోనని వాహనదారుడు అఫ్రోజ్ ఖాన్ ఆరోపించాడు. శనివారం రూ.230 పెట్రోల్ బైక్‌లో పోయించాడు. వాహనం సక్రమంగా నడవకపోవడంతో సోమవారం అనుమానం వచ్చి పెట్రోల్‌ను బాటిళ్లలో తీసి చూడగా నీళ్ల కల్తీ ఉందన్నారు. ఈ విషయాన్ని నిర్వాహకుల దృష్టికి తీసుకెళ్తే పట్టించుకోలేదని ఆరోపించాడు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరాడు.

సదర్మాట్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలి

ఖానాపూర్: ఖానాపూర్, కడెం మండలాల రైతుల జీవనాధారం సదర్మాట్‌పై ప్రభుత్వం నిర్లక్ష్యం వీడాలని బీజేపీ నేత, మాజీ ఎంపీ రమేశ్ రాథోడ్ అన్నారు. పట్టణంలోని గాంధీనగర్ సమీపంలోని కాలువతోపాటు పలుచోట్ల భారీ వర్షాలకు దెబ్బతిన్న కాలువలను సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సదర్మాట్‌పై కేసీఆర్ ప్రభుత్వం పూటకోమాట చెబుతుందన్నారు. కాలువకు గండ్లు పడి పక్షం రోజులు కావస్తున్నా, పూడ్చకపోవడంతో పాటు నీటివిడుదలపై స్పష్టత ఇవ్వడం లేదన్నారు. నాయకులు నాయిని సంతోశ్, ఆకుల శ్రీనివాస్ ఉన్నారు.

విహారం.. విషాదం

స్నేహితుల దినోత్సవం రోజున విహారం విషాదం నింపింది. సాత్నాల వాగులో గల్లంతైన మెడికో మిత్రుడు క్షేమంగా తిరిగొస్తాడని ఆదివారం రాత్రంతా ఎదురుచూసిన తోటి వైద్య విద్యార్థులకు కన్నీరే మిగిలింది. తిరిగి రాని లోకాలకు వెళ్లడంతో కుటుంబ సభ్యులు, స్నేహితుల రోదనలు మిన్నంటాయి.

- వాగులో మునిగి పీజీ వైద్య విద్యార్థి మృతి
- ఫ్రెండ్‌షిప్‌డే రోజునే ఈ ఘటన
- మృతదేహం లభ్యం.. కన్నీటిపర్యంతమైన మెడికోలు



మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి, కుటుంబీకులు



గల్లంతు కావడానికి ముందు స్నేహితులతో సరదాగా గడుపుతున్న ప్రవీణ్

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ రిమ్స్‌లో పీజీ ఫస్టియర్ చదువుతున్న 9 మంది మిత్రులు ఆదివారం సాత్నాల వాగు సమీపంలోని కోటిలింగాల వద్దకు వెళ్లారు. వాగులో కాలుజారి భూక్యా ప్రవీణ్‌కుమార్ గల్లంతైన విషయం తెలిసిందే. రాత్రి గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలు చేపట్టినా ఆచూకీ లభించలేదు. జాలర్లు సోమవారం శవాన్ని బయటకు తీశారు. కళ్లకు గంతలు కట్టినట్లు ఉండటంతో కుటుంబ సభ్యులు మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. విచారణ చేపట్టాలని పోలీసులను కోరారు. ఆహ్లాదంగా గడిపిన సమయంలో తీసిన ఫొటోలు, వీడియోల్లో తలకు కర్చీఫ్ కట్టి ఉండటాన్ని పోలీసులు చూపించారు. ఏమైనా సందేహాలుంటే తమను సంప్రదించాలని జైనథ్ సీఐ కోలా నరేశ్‌కుమార్ సూచించారు. డైరెక్టర్ ఛాంబర్‌లో విహారయాత్రకు వెళ్లిన వైద్యులతో సీఐ సమావేశమై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

చిన్నతనం నుంచే చదువుల్లో మేటి..

సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి మండలం రంగంపేటకు చెందిన భూక్యా ఉస్మాన్ నాయక్ రాథోడ్–లక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు శేఖర్ నాయక్ వ్యవసాయం చేస్తుండగా చిన్న కుమారుడు ప్రవీణ్‌కుమార్ ఎంబీబీఎస్ పూర్తి చేశారు. ప్రస్తుతం రిమ్స్‌లో ఆర్థోపెడిక్ పీజీ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. కాగా 1 నుంచి ఇంటర్ వరకు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో చదివాడు. ఆ తర్వాత మొదటి ప్రయత్నంలో ఎంబీబీఎస్ సీటు సాధించగా హైదరాబాద్ గాంధీ మెడికల్ కళాశాలలో విద్యనభ్యసించారు. ఆ తర్వాత తన స్వంత జిల్లాలోని ముస్తాబాద్‌లోని పీహెచ్‌సీలో మూడు నెలలపాటు మెడికల్ ఆఫీసర్‌గా సేవలందించారు. పీజీ సీటు రావడంతో రిమ్స్‌లో చేరాడు. ప్రయోజకుడై కుటుంబానికి అండగా నిలుస్తాడని అనుకున్న కొడుకు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఉన్న రెండెకరాల భూమిని సాగు చేసి, కూలీ పనిచేస్తూ చదివించినట్లుగా పేర్కొంటూ రోదించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టింది. కాగా బీఆర్ఎస్ నాయకుడు రంగినేని పవన్‌రావు ఫోన్‌లో బాధిత కుటుంబీకులను మంత్రి కేటీఆర్ పరామర్శించారు. అండగా ఉంటామని భరోసానిచ్చారు.

స్నేహితుల దినోత్సవం రోజే

ఆదివారం స్నేహితుల దినోత్సవం ఉండటంతో 9 మంది తోటి స్నేహితులు తొలుత కుంభఝరి సమీపంలోని కోటి లింగాలను దర్శించుకున్నారు. వీరిలో నలుగురు పురుష వైద్యులు ఉండగా ఆరుగురు మహిళా వైద్యులు ఉన్నట్లుగా రిమ్స్ వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత సరాదాగా నీటిలో ఆటలాడుతూ ఉత్సాహంగా గడిపారు. ఇంటికి బయల్దేరే క్రమంలో నీటిని దాటుతుండగా ప్రవీణ్ సెల్‌ఫోన్ నీటిలో పడిపోవడంతో దాన్ని తీసుకునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో బండపై నాచు ఉండటంతో కాలు జారి నీటిలో పడ్డాడు. స్నేహితులు కార్తీక్, రాజు కాపాడేందుకు ప్రయత్నించగా ఫలితం లేకుండా పోయింది. ప్రవీణ్ గుండంలో చిక్కుకుపోయాడు. వీరిద్దరిని కాపాడేందుకు మిగతా స్నేహితులు ప్రయత్నించగా వీరు సురక్షితంగా బయటపడ్డారు. అప్పటికే ప్రవీణ్ గల్లంతయ్యాడు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు, గ్రామస్తులు వాగు వద్దకు చేరుకున్నారు. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, మరి కొందరు వైద్యులు అక్కడకు చేరుకుని గజఈతగాళ్ల ద్వారా గాలింపు చేపట్టారు. రాత్రి 10 గంటల వరకు ఆచూకీ లభించలేదు. దీంతో పోలీసులు, గ్రామస్తులు నీటి ప్రవాహంలో కొట్టుకుపోకుండా ఉండేలా వలలు కట్టి ఉంచారు. సోమవారం ఉదయం 6 గంటలకే తిరిగి గాలింపు చర్యలు చేపట్టగా 8 గంటల ప్రాంతంలో మృతదేహం లభ్యమైంది. రిమ్స్ మార్చురీలో పోస్టుమార్టం అనంతరం తల్లిదండ్రులకు ప్రవీణ్ భౌతికకాయాన్ని అప్పగించారు.

కన్నీటి పర్యంతమైన రిమ్స్

పీజీ విద్యార్థి మృతిచెందాడని తెలియగానే రిమ్స్ మెడికోలు, వైద్యులు, సిబ్బంది కన్నీటి పర్యంతమయ్యారు. పోస్టుమార్టం అనంతరం డైరెక్టర్ ఛాంబర్ ఎదుట మృతదేహాన్ని ఉంచి నివాళులర్పించారు. కుటుంబీకుల రోదనలతోపాటు తోటి పీజీ విద్యార్థులు, మెడికోలు కన్నీరుమున్నీరయ్యారు. ఒక్కసారిగా ఆ ప్రాంతమంతా ఉద్విగ్న వాతావరణం నెలకొంది. రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, సూపరింటెండెంట్ అశోక్, వైద్యులు సుమలత, శ్యాంప్రసాద్, వెంకట్‌రెడ్డి, జాడే తానాజీ, అధికారులు పార్థివదేహంపై పుష్పగుచ్ఛాలు ఉంచి శ్రద్ధాంజలి ఘటించారు.



నివాళులర్పిస్తున్న రిమ్స్ డైరెక్టర్ జైసింగ్

ఎస్సైగా ఉపాధ్యాయురాలు ఎంపిక



సుస్మిత

కుభీర్: మండలంలోని నిగ్వా గ్రామానికి చెందిన జాడే సుస్మిత ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. ఆమె ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఎస్సైగా ఎంపికైంది. తల్లిదండ్రులు మీనాక్షి, నాందేవ్‌లు హర్షం వ్యక్తం చేశారు.

స్వగ్రామంలో జనగామ కలెక్టర్ పూజలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గ్రామస్తులు

కుంటాల: జనగామ కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య తన స్వగ్రామమైన నిర్మల్ జిల్లా కుంటాల మండలం లింబా(కే)లో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో సోమవారం సతీసమేతంగా పూజలు నిర్వహించారు. ఆలయ ధ్వజ స్తంభం కోసం రూ.4.50 లక్షలు విరాళంగా అందజేశారు. కలెక్టర్ దంపతులను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆనందరావు పటేల్, మాజీ ఆత్మ చైర్మన్ సర్వి అశోక్‌రెడ్డి, ఉప సర్పంచ్ ముత్యంరెడ్డి, ఎంపీటీసీ సత్యం గిరీష్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ట్రిపుల్‌ఐటీలో తరగతుల ప్రారంభం

భైంసా: బాసర ట్రిపుల్‌ఐటీలో నూతనంగా చేరిన విద్యార్థులకు సోమవారం నుంచి తరగతులు ప్రారంభించారు. వీసీ వెంకటరమణ ఆదేశాలతో నూతన విద్యార్థులకు తరగతులు చెప్పారు. డైరెక్టర్ సతీశ్‌కుమార్ తరగతులకు హాజరైన విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ప్రతి ఒక్కరూ 95 శాతం తరగతులకు హాజరుకావాలని సూచించారు. ఆరేళ్లు కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

మంత్రులను కలిసిన నాయకులు



మంత్రి మహమూద్ అలీతో నాయకులు

కుభీర్: రాష్ట్ర మంత్రులు మహమూద్ అలీ, సత్యవతి రాథోడ్‌ను బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, నాయకులు హైదరాబాద్‌లో సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండల సమస్యలను వివరించారు. మండలంలో అధికసంఖ్యలో గిరిజనులు లంబాడాలు, నాయక్‌పోడ్‌లు ఉన్నారని తెలిపారు. వారి కోసం బోర్లు, మోటార్లు, విద్యుత్ సౌకర్యం కోసం గిరివికాస్ కింద 400 యూనిట్లు మంజూరు చేయాలన్నారు. అదే విధంగా ఎస్టీ రుణాలు మంజూరైన వారికి సబ్సిడీ డబ్బులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మాజీ జెడ్పీటీసీ చవాన్ శంకర్, నాయకులు బాలా ఆనంద్, మిలింద్ చెకీనొద్దీన్ ఉన్నారు.

మైనర్ బాలికకు పెళ్లి..!

- సఖీ కేంద్రానికి తరలింపు



బాలికను సఖీ కేంద్రానికి తరలిస్తున్న అధికారులు

కుంటాల: మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు వివాహం జరిపించారు. ఎస్సై హన్మాండ్లు కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన దంపతుల పెద్ద కూతురు (14) కాగా నిర్మల్ రూరల్ మండలంలోని గంగ, పాపయ్య దంపతుల కుమారుడు నగేశ్(33)తో ఆదివారం కొండాపూర్‌లో వివాహం జరిపించారు. బాలిక మేనమామ రాందాస్ రూ.25వేలు తీసుకుని కార్యక్రమాన్ని అంతా దగ్గరుండి జరిపించాడు. సోమవారం ఉదయం బాలిక సర్పంచ్ కనిష్ ఫాతిమాను ఆశ్రయించింది. గత జులైలో నగేశ్‌కు మొదటి వివాహం జరిగి విడాకులైంది. ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మి విశారద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు. సదరు బాలికను నిర్మల్ సఖీ కేంద్రానికి తరలించామన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

దుబాయిలో కొట్ల(బి) వాసి మృతి

సారంగపూర్: ఉపాధి నిమిత్తం దుబాయికి వలసవెళ్లిన కార్మికుడు అబుదాబిలోని ఓ బీచ్‌లో ప్రమాదవశాత్తు బీచ్‌లో నీటిలో మునిగి శనివారం మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలు ఇలా..మండలంలోని కొట్ల(బి) గ్రామానికి చెందిన బెజ్జారం రమేశ్ (34) గతేడాది దుబాయి వెళ్లి అక్కడ గల్ఫ్ దూనెస్ కంపెనీలో లేబర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అయితే శుక్రవారం సెలవు దినం కావడంతో రమేశ్ అబుదాబిలోని ఓ బీచ్‌కు వెళ్లి సెలవు దినాన్ని ఎంజాయ్ చేద్దామనుకున్నాడు. ఈ క్రమంలో ఆయన బీచ్‌లోని అలల దాటికి మునిగి మృతి చెందాడు. స్థానికులు వివరాలు సేకరించి కుటుంబీకులకు సమాచారం అందజేశారు. మృతుడికి భార్య అనిత, ఇద్దరు ఆరేళ్లలోపు కుమారులు ఉన్నారు. కుటుంబానికి పెద్ద దిక్కయిన రమేశ్ మృతిచెందడం పట్ల ఆయన కుటుంబీకులతోపాటు గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, ప్రవాసీ మిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు స్వదేశ్ పరికిండ్ల బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి వివరాలను గల్ఫ్ ఎంబసీకి ఈ–మెయిల్ ద్వారా సమాచారం అందించారు.

జంగుబాయి కుటుంబాన్ని ఆదుకోవాలి

- ఐటీడీఏ ఎదుట ఆదివాసీ సంఘాల ధర్నా



ర్యాలీగా ఐటీడీఏకు వస్తున్న ఆదివాసీలు

ఉట్నూర్‌రూరల్: గతనెల 20న ఇంద్రవెల్లి మండలం ధనోరాలో లైంగికదాడి ఆపై హత్యకు గురైన కుడ్మెత జంగుబాయి కుటుంబాన్ని ఆదుకోవాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఐటీడీఏ ఎదుట సోమవారం ధర్నా చేపట్టారు. అంతకుముందు ఎన్టీఆర్ చౌరస్తా నుంచి ఐటీడీఏ వరకు ర్యాలీ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా తోటి మహిళా అధ్యక్షురాలు సోయం గంగామణి, ఆదివాసీ బిరుద్‌గోండ్ తోటి సేవాసంఘం మాజీ అధ్యక్షుడు తిరుపతి, ఆదివాసీ పీటీజీ యువసేన ఉమ్మడి జిలా కన్వీనర్ పెందూర్‌దత్తు పాల్గొని మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.50 లక్షలు అందించాలని, డబుల్ బెడ్రూం ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం ఇవ్వాలన్నారు. అలాగే నిందితులను ఉరితీయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఐటీడీఏ ఏపీవో జనరల్ నాగోరావుకు వినతిపత్రం అందజేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ నరేందర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

అర్జీలు సత్వరం పరిష్కరించాలి

- ఐటీడీఏ డీడీ దిలీప్‌కుమార్



అర్జీలు స్వీకరిస్తున్న డీడీ దిలీప్‌కుమార్

ఉట్నూర్‌రూరల్: అర్జీలను సత్వరం పరిష్కరించాలని ఐడీడీఏ డీడీ దిలీప్‌కుమార్ అన్నారు. ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో గిరిజనుల అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల అర్జీలను శాఖలవారీగా పరిశీలించి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో కనక భీంరావు, ఏడీఎంఅండ్‌హెచ్‌వో కుమ్ర బాలు, ఏవో రాంబాబు, ఏపీవో పీవీటీజీ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

- తమకు నివాస గృహాలు మంజూరు చేయాలని జైనూర్ మండలం కొలాంగూడ గ్రామస్తులు విన్నవించారు.
- తనకు ఆశ్రమ పాఠశాలలో ఉద్యోగం ఇప్పించాలని ఉట్నూర్ మండలం పాత ఉట్నూర్ గ్రామానికి చెందిన లలిత అర్జీ సమర్పించింది.
- సాగు భూమి పట్టా మంజూరు చేయాలని బోథ్ మండలం సాంగ్వీ గ్రామానికి చెందిన రాజేశ్ కోరాడు.
- తనకు ఇల్లు, పింఛను మంజూరు ఇప్పించాలని తలమడుగు మండలం ఝరి గ్రామానికి చెందిన కాశీరాం అర్జీ అందించారు.
- తమకు ఎడ్ల జతలు కావాలని జైనూర్ మండలం గూడమామడ గ్రామస్తులు కోరారు.

మద్యానికి బానిసై ఒకరి ఆత్మహత్య

బేల: మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం..మండలంలోని చప్రాల గ్రామానికి చెందిన పెందుర్ తులసిరాం (46) గత పదేళ్లుగా మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సోమవారం స్థానిక శివాజీ చౌరస్తా సమీపంలో మద్యం మత్తులో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సుమన్‌బాయి, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదుతో కేసు దర్యాప్తు ఎస్సై రాధిక తెలిపారు.

గోదావరిలో గుర్తుతెలియని మృతదేహం

కడెం: మండలంలోని చిన్నబెల్లాల్ సమీపంలోని గోదావరి నదిలో సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. ఇటీవల కురిసిన వర్షాలు, వరదలకు కొట్టుకువచ్చినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని బయటకు తీయించి, పూర్తి విచారణ చేపడుతామని ఎస్సై రాజు పేర్కొన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

బోథ్: మండలంలోని పొచ్చెర గ్రామానికి చెందిన వృద్ధురాలు గంగమ్మపై సోమవారం కోతులు దాడి చేసి గాయపర్చింది. ఇంటి వద్ద ఆరు బయట కూర్చున్న ఆమెపై కోతులు దాడిలో గాయపడింది. స్థానికులు బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

దిలావర్‌పూర్: మండలంలోని న్యూలోలం, సిర్గాపూర్ గ్రామాల మధ్య నిర్మల్–భైంసా రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని గుండంపల్లి గ్రామానికి చెందిన ముక్కెర సాయినాథ్ గౌడ్ తన భార్య సుప్రియ, రెండేళ్ల కుమారుడు శ్రీయాన్‌తో కలిసి బైక్‌పై నిర్మల్‌కు బయల్దేరాడు. న్యూలోలం గ్రామం దాటగానే సిర్గాపూర్ బస్టాండ్ సమీపంలో వెనుకనుంచి వస్తున్న ఎర్టిగా వాహనం బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో సాయినాథ్‌గౌడ్, శ్రీయాన్‌కు గాయాలు, సుప్రియ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వాహనదారులు, బీఆర్ఎస్ మండల కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఎంపీపీ పాల్దె అక్షర అనిల్‌లు క్షతగాత్రులను నిర్మల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇద్దరు మట్కా నిందితుల అరెస్ట్

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఖుర్షీద్‌నగర్‌లో మట్కా నిర్వహిస్తున్నారనే పక్కా సమాచారంతో సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ జె.కృష్ణమూర్తి ఆధ్వర్యంలో దాడి చేసి ఇద్దరు మట్కా నిందితులను అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహారాష్ట్రంలోని యావత్‌మాల్ జిల్లా పాంఢ్రకోడకు చెందిన గొలురాయి అలియాస్ శుభం రాయి ఆన్‌లైన్ ద్వారా ఖుర్షీద్‌నగర్‌కు చెందిన షేక్ షహబాజ్, మహాలక్ష్మివాడకు చెందిన తోట జీవన్ ద్వారా మట్కా నిర్వహిస్తుండగా పట్టుబడ్డారు. ఈ ముగ్గురిపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో నమోదు చేశారు. అలాగే వీరి వద్ద నుంచి రూ10,530 నగదు, రెండు సెల్‌ఫోన్లు, మట్కా చిట్టీలను స్వాధీనం చేసుకున్నారు.

మట్కా నిర్వాహకుడి అరెస్ట్

నిర్మల్‌టౌన్: మట్కా నిర్వాహకుడిని సోమవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ పురుషోత్తం తెలిపారు. సీఐ కథనం ప్రకారం.. జిల్లా కేంద్రంలోని గుల్జార్ మార్కెట్‌లో రాజు మట్కా నిర్వహిస్తుండడంతో స్థానికులు అతన్ని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అతని వద్ద నుంచి రూ.4860, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

ఒకరికి మూడునెలల జైలు

నిర్మల్‌టౌన్: ఒకరిని కర్రతో కొట్టి గాయపర్చిన ఘటనలో నిందితుడికి మూడు నెలల సాధారణ జైలుశిక్షతోపాటు జరిమానా విధిస్తూ నిర్మల్ ప్రథమ శ్రేణి న్యాయమూర్తి అజయ్‌కుమార్ సోమవారం తీర్పు వెలువరించారు. కోర్టు సమన్వయల అధికారి సక్రియ నాయక్ కథనం ప్రకారం.. మామాడ మండలం జయరాం తండాకు చెందిన చాహన్ పరశురాం ఆవులు 2015, ఏప్రిల్ 15న నిందితుడు చవాన్ జ్యోతిసింగ్ తోటలో పంటనష్టం కలిగించాయి. దీంతో నిందితుడు పరశురామ్‌ను అసభ్యపదజాలంతో దూషించాడు. ఎందుకు తిడుతున్నావని పరశురాం కుమారుడు గంగాధర్ అనడంతో నిందితుడు కర్రతో పరశురామ్‌ను కొట్టాడు. బాధితుడు మామడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్సై శ్రీనివాస్ కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి చార్జీషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ రామకృష్ణ ఏడుగురు సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో జ్యోతి సింగ్‌కు మూడు నెలల సాధారణ జైలు శిక్షతోపాటు, రూ. 1500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

బైక్ చోరీ

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్‌స్టేషన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో బైక్ చోరీ గురైంది. ఎస్సై విష్ణువర్ధన్ కథనం ప్రకారం.. ఆదిలాబాద్‌లోని తిలక్‌నగర్‌కు చెందిన చేతన్ కిష్టారెడ్డి ఈనెల 2న కేతన్‌వార్ టీచర్స్ కాలనీలో తన బావ వరుణ్‌రెడ్డి ఇంటి ఎదుట బైక్ పార్కింగ్ చేసి వెళ్లాడు. మరుసటి రోజు బైక్ కనిపించదు. నాలుగు రోజులు వెతికినా బైక్ కనిపించలేదు. బాధితుడు ఫిర్యాదుతో సోమవారం కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులు దాటి వైద్యం



వాగు దాటి గోపాల్‌పూర్‌కు వెళ్తున్న వైద్యులు

ఇంద్రవెల్లి: మండలంలోని పిట్టబోంగరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో కన్నాపూర్ వాగు దాటి గోపాల్‌పూర్, గోపాల్‌పూర్‌గూడ గ్రామాల్లో సోమవారం వైద్యం అందించారు. వైద్యుడు ప్రతాప్‌నాయక్, సిబ్బంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలను పరీక్షించి నెలకు సరిపడా మందులు అందజేశారు. హెల్త్ సూపర్‌వైజర్ జలెంధర్, ఏఎన్ఎంలు విజయసుందరి, శివరంజని తదితరులు ఉన్నారు.

మద్యం విక్రయించొద్దు

- నాలుగు గ్రామాలు తీర్మానం



తీర్మానం కాపీ చూపుతున్న ఆయా గ్రామాల ప్రజలు

సిరికొండ: మద్యం కారణంగా కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నాయని గమనించిన ఆయా గ్రామాల ప్రజలు ఇక తమ గ్రామాల్లో మద్యం విక్రయాలు చేపట్టవద్దని తీర్మానించాయి. మండలంలోని చిమ్మన్‌గూడి, సూర్యపేట్, రాంనగర్, చింతగూడ గ్రామాలవాసులు సోమవారం చిమ్మన్‌గూడిలో సమావేశమయ్యారు. ఇక నుంచి తమ గ్రామాల్లో మద్యం, గుడుంబా విక్రయాలు చేపట్టవద్దని, ఎవరైనా అతిక్రమిస్తే రూ.2లక్షల జరిమానా విధిస్తామని పేర్కొన్నారు. ఇందులో నాలుగు గ్రామాల పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు.